# బంజారాలను అణిచివేసేందుకు కాంగ్రెస్ కుట్ర

- టికెట్ల కేటాయింపులో రేవంత్‌రెడ్డి వివక్ష
- బీఆర్ఎస్‌తోనే బంజారాలకు గుర్తింపు
- మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

బయ్యారం, నవంబర్ 25 : బంజారాలను అణచివేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని మాజీ ఎంపీ అజ్మారా సీతారాంరాయక్ విమర్శించారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 30 లక్షల మంది గిరిజనులు ఉంటే అందులో ఏడు శాతం బంజారాలు ఉండగా మూడు శాతం మాత్రమే అనేక కులాలకు చెందిన గిరిజనులు ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బంజారాలకు టికెట్ల కేటాయింపులో వివక్ష చూపారని తెలిపారు. లంబాడీలను గిరిజనుల జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేసిన వారికి కాంగ్రెస్, బీజేపీ పార్టీలు టికెట్లు ఇచ్చారని వివరించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రేవంత్‌రెడ్డి బంజారాల ఉనికి లేకుండా చేస్తాడని ఆరోపించారు. సేవాలాల్, హతీరాం, లాలా వట్యా, జంగీబంగి, హనూనాయక్ వంటి బంజార మహనీయుల గురించి వారికి తెలియదన్నారు. రాష్ట్రంలోని 60 నియోజక వర్గాల్లో గెలుపోటములను ప్రభావితం చేసే బంజారాల విషయంలో కాంగ్రెస్ చిన్న చూపు చూసిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక బంజారాలకు తగిన గుర్తింపు లభించిందన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటకు కట్టుబడి తండాలను జీపీలుగా మార్చారన్నారు. గిరిజనుల పోడు సమస్యను తీర్చిన బీఆర్ఎస్‌కు బంజారాలు అండగా నిలువాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత బంజారాలపై ఉందన్నారు. బంజారా ఎమ్మెల్యేలు లేకపోతే జాతి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ ఇల్లెందు అభ్యర్థి హరిప్రియా నాయక్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో మూడోసారి 80-85 సీట్లతో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బాలూ చౌహాన్, రాంచంద్రూ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు భూక్యా కోట్యా, రమేశ్ నాయక్, అజ్మీరా నాగేంద్ర, సత్యనారాయణ, వెంకన్న పాల్గొన్నారు.


బీఆర్ఎస్‌లో చేరిన వారితో సతీశ్‌రెడ్డి

## బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

కొత్తగూడ, నవంబర్ 25 : పెగడపల్లి, బత్తులపల్లి తదితర గ్రామాల్లో రెడ్‌కో చైర్మన్ సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. జెజ్జరి వెంకన్న, సాంబయ్య, పెనక మహేశ్, సురేందర్, యాకయ్య, మొగిళి, మాలో బద్రూ, వీరన్న తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కే వేణు, గ్రామ అధ్యక్షుడు లావణ్యా రాజు, సింగిల్ విండో డైరెక్టర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గణేశ్

### బయ్యారంలో..

బయ్యారం, నవంబర్ 25 : మండలంలోని జగ్గుతండాకు చెందిన పలువురు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుగులోత్ రాంకోటి, మందనపు వెంకన్న, సక్రులు బీఆర్ఎస్‌లో చేరగా మండల అద్యక్షుడు తాత గణేశ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ... బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఇల్లెందు అభ్యర్థి హరిప్రియా నాయక్ గెలుపు ఖాయమని తెలిపారు. ఈ కర్యాక్రమంలో నాయకులు వెంకటకృష్ణ, బావుసింగ్, రామోజీ తదితరులు పాల్గొన్నారు.


విస్సంపల్లిలో రోడ్డుపై ధాన్యం ఆరబెట్టిన రైతులు

## వరికోతలు షురూ..

చిన్నగూడూరు, నవంబర్ 25 : మండలంలో వరికోతలు మొదలయ్యాయి. ధాన్యం చేతికందే సమయం రైతులు ఆనందంగా వరి కోతలను ప్రారంభిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు ఉగ్గంపల్లి, విస్సంపల్లి, గుండంరాజుపల్లి, జయ్యారం తదితర గ్రామాల్లో రైతులు, కూలీలు బిజీగా ఉన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు. కాళేశ్వరం నీటితో చెరువులు, కుంటల్లో నీరు పుష్కలంగా చేరి రైతులకు సాగు నీటి కొరత తీరింది. అరమడి వదిలిపెట్టకుండా రైతులు నాట్లు వేసి వరి కోస్తున్నారు. గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు రెండు నెలల వరకు ఉపాధికి ఎలాంటి ఢోకా లేదని సంబురంగా తెలుపుతున్నారు. రెండు పంటలు పండిస్తున్నామని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## నాగజ్యోతిని భారీ మెజార్జీతో గెలిపించాలి

గంగారం, నవంబర్ 25 : బీఆర్ఎస్ ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి కారు గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్జీతో గెలిపించాలని రాష్ట్ర రెడ్‌కో చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి కోరారు. కోమట్లగూడెం సర్పంచ్ గొగ్గల సుగుణా లక్ష్మయ్య ఆధ్వర్యంలో యువకులు, పార్టీ శ్రేణులు శనివారం సతీశ్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా సతీశ్‌రెడ్డి వారికి ఎన్నిక ప్రచారంపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లోడ్ వెంకన్న, దుర్గం సమ్మయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేత

దంతాలపల్లి, నవంబర్ 25: మండల కేంద్రంలో ప్రభుత్వ దవాఖాన పరిధిలోని నర్సింహులపేట, దంతాలపల్లి మండలల్లో 51మంది క్షయ వ్యాధిగ్రస్తులకు దాతల సహకారంతో శనివారం పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీధర్ మాట్లాడుతూ.. క్షయ బాధితులు మందులతో పాటు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. తొర్రూరు లయన్స్ ఆఫ్ తరుణి, బ్రేకింగ్ ది బ్యారియర్స్, దంతాలపల్లికి చెందిన దాత కుమరస్వామి పౌష్టికాహారం అందించేందుకు ముందుకు రావడంపై అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ చైతన్య, సీహెచ్‌వో బాలాజీ, లయన్స్ నాగవాణి, శ్రీధేవి, జ్యోతి, విజయ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఉప్పలయ్యకు ప్రముఖుల నివాళి

మరిపెడ, నవంబర్ 25: బీఆర్ఎస్ క్రియాశీలక కార్యకర్త, మందుల సంఘం రాష్ట్ర నాయకుడు పెండ్ర చిన ఉప్పలయ్య మృతి విచారకరమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు అన్నారు. శనివారం మున్సిపల్ కేంద్రంలో బ్రెయిన్‌డెడ్‌కు గురై చికిత్స పొందుతూ మృతిచెందిన ఉప్పలయ్య భౌతికకాయంపై పులమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఉప్పలయ్య మృతి బీఆర్ఎస్‌కు తీరనిలోటు అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ సింధూరాకుమారి, వైస్‌చైర్మన్ బుచ్చిరెడ్డి, పానుగోత్ రాంలాల్, కౌన్సిలర్లు కిషన్, కేలోత్ వస్రం, బాలజీ ఉన్నారు.


నివాళులర్పిస్తున్న నవీన్‌రావు

## బుగులోని జాతరకు ఏర్పాట్లు పూర్తి

**ఈవో బిళ్ల శ్రీనివాస్**

రేగొండ, నవంబర్ 25 : బుగులోని జాతరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో బిళ్ల శ్రీనివాస్, ఆలయ అర్చకుడు కే వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం వారు మీడియాతో మాట్లాడారు. ఈనెల 26 నుంచి డిసెంబర్ 1 వరకు జాతర జరుగుతుందని వెల్లడించారు. జాతరలో భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్యం, విద్యుత్ రోడ్లు, తాగు నీటి సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అలాగే పరకాల, భూపాలపల్లి నుంచి ఆర్టీసీ బస్సులు రానున్నట్లు వివరించారు. గుట్టపై భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.


ఆలయ స్వాగత తోరణం

## బయ్యారంలో జోరుగా బీఆర్ఎస్ ప్రచారం


కంబాలపల్లి ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు

బయ్యారం: మండలంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం జోరుగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్నారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్‌కు అండగా నిలిచి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కంబాలపల్లి జీపీలో హలావత్ బాలు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బయ్యారంలో హెచ్ రమేశ్, బ్రమ్మచారి, గణేశ్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

గార్ల, నవంబర్ 25: గార్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో గార్ల-1, గార్ల-2, గండి, చంద్రగిరి, రాంపురం, పెద్ద కిష్టాపురం, దుబ్బగుడెం, ముల్కనూర్, గుంపెళ్లగూ డెం, సీతంపేట, శేరిపురం, పుల్లూరు, పోచారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీఈవో సింగు వెంకటేశ్వర్లు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ-గ్రేడ్ ధాన్యం రూ.2203, సీ-గ్రేడ్ రూ.2183 ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ధార బీముడు, రేగళ్ల రాజేశ్, హనుమంతు, రవి, రాములు, చంద్రశేఖర్, భద్రమ్మ పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈవో వెంకటేశ్వర్లు


గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

## లెర్నింగ్ ట్రీ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్

మహబూబాబాద్, నవంబర్ 25 : జిల్లా కేంద్రంలోని నర్సంపేట బైపాస్ రోడ్డులోని లెర్నింగ్ ట్రీ స్కూల్ విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారు. పాఠశాలలో ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ సంస్థ నిర్వహించిన పరీక్షలో విద్యార్థులు ప్రతిభ చాటారు. వారికి ప్రిన్సిపాల్ సాధనరెడ్డి మెడల్స్, సర్టిఫికెట్లను శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్కే రఫియా, వీ ప్రణీత, ఎస్ వైశాలి, జీ రంజిత్, లీలాభవాని పాల్గొన్నారు.


ఆలయ కమిటీ సభ్యులకు చెక్కును అందిస్తున్న రామారావు కుటుంబ సభ్యులు

## రామాలయ నిర్మాణానికి రూ. 5 లక్షల విరాళం

గంగారం, నవంబర్ 25 : మండల పరిధిలోని దుబ్బగూడెం జీపీలోని మామిడిగూడెం గ్రామంలో నిర్మిస్తున్న రామాలయం కోసం జనగాం రామారావు-సాంబలక్ష్మి దంపతులు శనివారం ఆలయ కమిటీ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు విరాళం అందించిన కుటుంబ సభ్యులను దేవుడి ఆశీస్సులు ఉంటాయన్నారు. గట్టమ్మ దేవాయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఈసం కాంతారావు, జనగాం వెంకన్న, విజమ్ పాల్గొన్నారు.